

బొమ్మ హేమాదేవి

# ఇజ్జత్ హై

**వర్షాకాలం. సాయంసమయంలో దట్టంగా మేఘాలు అలుము కోవడం వల్ల మరీ చీకటైపోయి, వాతావరణం భయంకరంగా తయారైంది.**

అంతకు వారం రోజుల క్రితమే ఇట్లాగే మిట్ట మధ్యాహ్నం చిమ్మ చీకటైపోయి ఇంతా అంతా వర్షం కురియలేదు. అప్పుడు ఓస్కూలు భవనం కూలిపోయి పసికూనల ప్రాణాల మీదికి రావటం, కొన్ని చెట్లు కూలి గుడిసెల్లో వాళ్ళకి చచ్చే పర్యంతం ఐంది. ఎలక్ట్రిక్ పోల్స్ కూలి ఒకరిద్దరికి షాక్ తగిలి ఆ ఒకరిద్దరు చచ్చిపోయారు. ఓ ట్రెయిన్ వంతెన మీదినుంచి నదిలో పడి కొన్ని వందలమంది చచ్చిపోయారు ఇవన్నీ వర్షాకాలాల్లో జరిగిన సంఘటనలు. ఈ సంఘటనలన్నీ ఒకొకటి గుర్తుకు రాసాగాయి, ట్రయిన్‌లో కూర్చుని భర్త దగ్గరకు వెళుతోన్న విజయకు... ఐనా అటు ఇటు జరిగి, తనని తాను సర్దుకుని, బాగా ఊపిరి పీల్చుకుని కిటికీలోనించి, సాయం సమయంలోని అంధకారంలోకి చూడసాగింది విజయ.

అప్పుడప్పుడు ఆకాశంలో పెద్ద పెద్ద మెరుపులు ఉరుములు చూచి ట్రెయిన్‌లో మిగతా వాళ్ళు కొందరు బెదిరిపోయినా విజయమాత్రం తనని తాను ఎందుకో మొండిగా తయారు చేసుకుంది. భర్త దగ్గరికి వెళ్ళే వాళ్ళకి ఇట్లాంటి మొండితనం అవసరం అనుకుందో ఏమో?

ఒకటి రెండుసార్లు తనకు బాగా ఇష్టమైన పాటగూడా పాడుకుంది 'కురిసింది...' అని.

మిథిలలో రైలు ఆగగానే, తన సూట్‌కేస్ పట్టుకుని ప్లాట్‌ఫారం మీద దిగింది. వర్షం బాగా పడ్తోంది. ఐనా స్టేషన్ అవతల చెట్లకింద 1, 2 జట్కాలున్నాయి ఓ జట్కా మాట్లాడి కూచుంది. స్టేషన్‌కు తమ క్వార్టర్స్ కొంచెం దూరమే, చేతి గడియారం వంక చూసుకుంది. రాత్రి 9 ఐంది. గడిచిపోయిన విషయాలు ఏవేవో గుర్తుకు వస్తోంటే ఆ జ్ఞాపకాల్లో మునిగిపోయింది విజయ...

కొంచెందూరం జట్కా పరుగెత్తింది. జట్కా అతను హుషారుగా కాస్సేపు పాడుకున్నాడు. ఆ మీదట గుఱ్ఱం పరుగు మాని నడక ఆరంభం చేసింది. జట్కాతను విజయతో మాటలు మొదలు పెట్టాడు. తనకు తెలుగు అర్థం ఔతుంది కాని మాటాడ్డం రాదు అన్నాడు. విజయకు హిందీ విషయంలో కూడా అంతే. ఫ్రీగా మాట్లాడలేదు. అందుకు విజయ తెలుగులో జట్కా అతను హిందీలో మాట్లాడుకోసాగారు.

''అమ్మాయిగారు ఇంత చీకట్లో తోడు లేకుండా బయలుదేరారు'' అన్నాడు

''ఇంత చీకటి ఔతుందని అనుకోలేదు. బండి బాగా లేటైంది. ఐనా తోడు నువ్వు ఉన్నావు కదా?'' అంది చిన్నగా నవ్వుతూ విజయ. జట్కా అతను వెనక్కి తిరిగి ఓమారు విజయ వైపు చూచి.

''అయ్యగార్కి పెద్ద ఉద్యోగమా?'' అడిగాడు.

''ఊఁ కొంచెం పెద్దది'' అంది.

''మరి వారికి జాబు రాయకపోయారా, స్టేషన్‌కు వచ్చేవారు.''

విజయ సమాధానం ఇవ్వలేదు నవ్వి వూరుకుంది.

''ఇట్లా చీకట్లో పయాణాలు మంచివి కావు అమ్మాయిగారూ రోజులు మంచివికావు'' అన్నాడు.

''మనుషులు బాగా లేరను, రోజులు కావు'' అంది నవ్వుతూనే.

''అదీ నిజమే అనుకోండి కాని, మీకు తెలిసివుండదు. మొన్నటిసారి వాన పడ్డప్పుడు ఇట్లాగే ఓ అమ్మాయి బాగా చదువుకున్నది, ఒంటరిగా మావూరి టాంగాలోకి వస్తోంటే ఆ టాంగా వెధవ ఆ అమ్మాయిని నానా అల్లరి పెట్టాడు. పాపం ఆ బిడ్డని అన్నివిధాల నాశనం చేశాడు''.

''భీమన్న సంగతేనా నువ్వు చెప్పేది?''

''ఔనౌను, ఈ వూరు బాగా తెలుసా మీకు?''

''బాగా దీని గురించి తెలియదు. కొంచెం తెలుసు. అన్నట్టు అది జరిగిన రెండుమూడు రోజులకే భీమన్న జట్కా మీదినుంచి పడి రెండు కాళ్లు విరగ్గొట్టుకున్నాడట కదా? ఓ కన్నుకూడా లొట్ట పోయిందట. పాపం అతను సర్వనాశనం ఐనాట్ట కదా?'' అని ఇంకేదో అనబోయింది. ఈలోగా జట్కా అతను ''నా గురించి మీరు భయపడకండి. నేను మంచివాణ్ణి'' అన్నాడు. విజయ నవ్వి, ''నేనుకూడా కొంచెం గుండెధైర్యం వున్నదాన్నే అన్నింటికి, అందరికి భయపడ్తూ కూర్చోను. 'కరాటా' అంటె తెలుసా నీకు? అది కొంచెం వచ్చునాకు' అని ''నామూలాన నీ కాళ్ళకు, కళ్ళకు భయం ఏం లేదులే'' అంది కొంచెం ఆగి జట్కా అతను గట్టిగా నవ్వుతూ ''భలేవారే అమ్మాయిగారూ మీరు'' అన్నాడు.

ఈలోగా అటువైపే వస్తోన్న ఓ జీపు కనిపించింది. తీరా చూస్తే ఆ జీపులో వుంది విజయ భర్త భూషణం.

జట్కా కనిపించగానే జీపుని ఆపాడు. భర్త కనిపించగానే జట్కా అతనికి డబ్బిచ్చి జట్కాదిగి, సూట్‌కేస్ తీసుకుని జీపులోకి ఎక్కింది విజయ.

దోవలో ఇద్దరేం మాటాడుకోలేదు.

ఇంటికి వచ్చాక గుడ్డలు మార్చుకున్నారు. భర్తకు టేబుల్‌పైన భోజనం అమర్చి అక్కడ ఇంకో కుర్చీమీద కూర్చుంది విజయ.

''వచ్చేశావేం? నా బ్రతుకు నేను

బతుకుతానన్న అహంతో వెళ్ళావుకదా?" పవైపు భోంచేస్తూనే అడిగాడు భూషణం.

"ఔను, నా బ్రతుకు నేను బ్రతకడానికి వచ్చాను" అంది విజయ.

"అంటే !"

"అమ్మ చెప్పింది. ఆడదానికి కామన్ సెన్స్ చాలా అవసరమని, అది వాడుకుంటూ బ్రతకడం నేర్చుకోమని, అట్లా ఐతే చచ్చేవరకు దిగులుండదు అంది".

"అంటే ?"

"మీకు అర్థం కాదులెండి" అంది నవ్వుతూ.

"నీకు సెన్సే లేదు కామన్ సెన్స్ దాకా వెళ్ళమందా మీ అమ్మ."

"ఏదోలెండి, తెలిసే తను - పెద్దమనిషి నాలుగు మాటలు చెప్పింది. దానికేంగాని, ఈ హోటల్ భోజనం మీకు సరిపడదు. అన్నం ఎట్లా కెలుకుతున్నారో చూడండి. ఈ విషయం గుర్తుకు రాగానే ఇంక ఉండలేక పరుగెత్తుకుని వచ్చేశాను."

"కాని, నీకు చీటికి మాటికి తప్పులు, 'ఆ' అంటే సాధిస్తావు. 'ఊ' అంటే పుట్టింటికి పరుగుపుచ్చుకుంటావు."

"ఇహ ఇప్పుడు వెళ్ళను లెండి. మీకోసం నేను ఏమైనా ఫరవాలేదనే వచ్చేశాను" అంది.

"నాలుగురోజులు పుట్టింట్లో గడిపేసరికి తెలిసొచ్చిందన్నమాట, "భర్త" అంటే ఏమిటో, ఎవరో......!"

"బాగా చెప్పారు."

"అదికాదు విజయా! నేను సంపాయిస్తున్నాను. కాబట్టి నా ఇష్టం వచ్చినట్లు నేను బతుకుతాను. నువ్వు..."

"అబ్బె! ఇంక నేనేమీ అనను మీఇష్టం. గడ్డి తినాలనిపించినా తినండి. నా అభ్యంతరం లేదు, సంపాయిస్తున్నారుగా ! ఆ అధికారాలన్నీ మీకుంటాయి." నవ్వుతూ అంది.

"తమాషాకికాదు, నిజంగానే అంటున్నాను. జన్మతః మగవాడికి కొన్ని అధికారాలు, అర్హతలు ఉంటాయి."

"ఔనట, మా అమ్మ చెప్పింది."

"చెప్పిందా?"

"ఊం. సుమతీ, సావిత్రిలా బ్రతకటం నేర్చుకోమంది. మీరు తాగినా తడిపినా పెదవి విప్పకు అంది. పీడపట్టున హాయిగా ఆడుతూ, పాడుతూ భగవంతుని మందిరంలో కూర్చోక ఎందుకే నీకీ తెగులు అంది".

"ముసలమ్మ అసాధ్యురాలిలా వుంది?"

"అదికాదండి. ఈ రోజుల్లో సంపాయించే ప్రతి మగాడు వీలైనంత మట్టుకు, వీలైనన్ని విధానాల్లో ఆనందాలని అనుభవిస్తున్నాడని, అది స్త్రీ పెద్దగా పట్టించుకుంటూ కూర్చుంటే ఆరోగ్యం పాడౌతుందని, మగవాడి విషయం వేరు. వాడేమైనా సభ్య ప్రపంచం ఆమోదిస్తుందనీ, ఆడదాని విషయం అట్లాకాదు తోటిస్త్రీ అనారోగ్యాన్ని ఏ స్త్రీ భరించదు అంది మా అమ్మ. మీ ఇష్టం. మీరు ఎన్ని ఆనందాలనైనా అనుభవించండి నా అభ్యంతరం ఏం లేదు. అవసరం ఐతే గంపలో కూర్చోబెట్టుకుని ఏ గుమ్మాల ముందు దింపమన్నా దింపుతాను" అంది.

"అర్థం లేకుండా మాటాడకు. ఈ కబుర్లు చెప్పటం తేలికే" అని మళ్ళీ "మగాడి అండ లేకుండా ఒక్కరాత్రి ఈ పట్నం అంతా నిర్భయంగా తిరిగి క్షేమంగా ఇంటికి తిరిగితా అప్పుడు తెలుస్తుంది నీకు మొన్న ఆ భీమన్న..."

"ఔను, ఆవిషయం నాకు తెలుసు. నేను ఇక్కడ ఉన్నప్పుడేకదా - ఆ గొడవంతా జరిగింది."

"మరి—!? నేను ఈ రోజు దార్లో కనిపించకపోతే, ఏమయ్యేదో నీగతి! పైగా ఇంత చీకట్లో, వర్షంలో తగుదునమ్మా అని బైలుదేరి వచ్చావు."

"నా గురించి అలా వదలండి, మీరైనా ఒంటరిగా ఎందుకు బైలుదేరారు? వాళ్ళు నల్గురైతే చాకలి గుడ్డలుతికినట్టు ఉతికే నేవారే మిమ్మల్ని. ఎంత మగాడైనా, ఆఫీసరైనా... ఇట్లాంటి విషయాల్లో... అదీ అడదాన్ని చూస్తే, బ్రహ్మకైనా పుట్టు రిమ్మ తెగులు అంటారు. వాళ్ళు నల్గురైతే - మీ రొక్కరు ఏం చేయగలిగేవాళ్ళు? సినిమా కూడా కాదాయె... ఒకే హీరో 40 మంది రౌడీలను పారదోలి మళ్ళీ డ్యూయెట్ పాడడానికి... ఎన్ని దెబ్బలు పడేవో మీమీదా?"

"నువ్వు ఈడియట్‌వి. నేను సీరియస్‌గా మాటాడ్తుంటే-నీకు తమాషాగా వుంది" అన్నాడు తినడం ఐపోవటంతో లేచి చేతులు కడుక్కుంటూ.... తర్వాత విజయ క్యారియర్ మూసి పెడ్తూంటే,

"నువ్వు తినవా?" అడిగాడు.

"అమ్మ చెప్పింది" అని విజయ ఎప్పుడూ భర్తతిన్నాకే తింటుంది. కాని ఈ రోజు తర్వాతకూడా తినకపోతే, పాపం ఉండబట్టలేక అడిగాడు భూషణం. హోటల్ భోజనం, విజయకు సరిపడదు. గతిలేక తింటాడు మగమనిషి అనుకుంటుంది విజయ. కాని ఆమాట పైకి అనలేదు. పైగా తనవెంట తల్లి యిచ్చిన సున్ని ఉండలు,

## వచ్చేవారం:

- ఫుట్‌పాత్‌లమీద పుస్తక ప్రపంచం — (విశేష రచన)
- పనికిరాని పాఠాలు (కథ) — మధురాంతకం రాజారాం
- పరీక్ష (కథ) — శ్రీధర
- కొత్తరకం ప్రేమ కథ (కథ) — ఆదిత్య
- గణితశాస్త్ర మహా మేధావి శ్రీనివాస రామానుజన్ — కృష్ణ
- 'అనంతం'లో మహాకవి శ్రీశ్రీ చైనా పర్యటన విశేషాలు
- సినిమా జీవితాలలోని ఎత్తు పల్లాలకు అద్దం పడుతున్న వాసిరెడ్డి సీతాదేవి సీరియల్ నవల 'సావేరి'
- పిల్లలను మురిపిస్తున్న సీరియల్ రాజు—పేద
- సినీతంత్ర • బాలతంత్ర • ఇంకా యితర ఆకర్షణలు!

పులిహోర, కోడికూర, పూరీలు కడుపు నిండా తిన్నది, రెండురోజులు అన్నం లేక పోయినా తట్టుకోగలిగేటట్టు...కడుపునిండాక నేతిలో వేయించిన గారెలుగూడా చేదుగా వుంటాయట...ఇహ హోటల్ క్యారియర్ చూస్తే, విజయకు అసహ్యమేసింది. క్యారియర్‌లో మిగిలి పోయిన-పప్పు-చారు-కూర అవతల పారవేసి, మజ్జిగ, అన్నం మాత్రం ఇంట్లో కుక్కకు-దాని గిన్నెలో వేసింది... అప్పుడు ఆ కుక్కవైపే చూస్తున్న భూషణం, "నువ్వూ ఆ కుక్క చాలా అదృష్టవంతులు" అని ఇంకేదో అనబోయాడు మధ్యలోకి విజయ, ఓ రకం బాధను వ్యక్త పరుస్తూ, "ఎందుకు అలా బాధ పడతారండి. నన్ను ఆ కుక్కతో పోల్చినా బాధ పడనుగాని, మిమ్మల్ని మీరు దురదృష్టవంతు లనుకుని, ఈ కుక్క మీ కన్నా అదృష్టంకలదని అనబోకండి నేను పూర్తిగా మారిపోయి వచ్చేశాను మీకు ఎలాంటి బాధకలిగినా ఇంక సహించలేను. ఇహ మీకు ఎట్లాంటి బాధ లుండవు మీరు చెప్పినట్టే నేను వింటాను" అంది, భర్తకు దగ్గరగా వెళ్ళి, అతన్ని అంటుకుని కూర్చుంటూ - బ్రతకనేర్చిన విధానంలో అతన్ని నిమురుతూ...

"అదికాదు విజయా! మిమ్మల్ని ఇంట్లో కూర్చోబెట్టి, మేము తేరగా మేపుతుంటాం కదా? ఉన్నట్టుండి అన్నాడు మానవుడు.

"మీరుపశువులగురించి మాట్లాడుతున్నారా"

"లేదు పెళ్ళాం మొగుడి గురించి మాటాడుతున్నాను".

'ఓ' అని మళ్ళా "నేను ఉద్యోగం చేస్తానంటే మీరే వద్దన్నారు కదండీ?" అడిగింది.

"అది ఎవడో దుర్మార్గుడు నువ్వూరుకో" అనగానే, వెంటనే వూరుకుంది విజయ

"మేము జీవితాంతం, అట్లా మేపుతూ కూర్చోబెట్టినా ఆడదానికి విశ్వాసం ఉండదు. మగాడి క్షణికానందంకూడా భరించుకోలేక, కుళ్ళుతో సంసారాన్ని నరకప్రాయంగా చేస్తుంది మీ జాతే అంత. ఓర్వలేదు. తోటి మనిషి సుఖం అంటేనే అసూయ మీకు ఇట్లాంటి మిమ్మల్ని మేము జన్మంతా అపురూపమైన గౌరవంతో..."

"ఇదంతా గౌరవమేనా?"

"గౌరవమేకాదు. ఓ కవచంలా కాపాడాడు పురుషుడు స్త్రీని,

"జానెను. ఓర్వలేని తనం, అసూయ, ఇవి స్త్రీనుంచి పురుషుడి దగ్గరకు రాగానే, అర్థం మారిపోయి కవచం ఐపోతుంది ఈ రాకపోకల్లో చాలా వాటికి పదాల అర్థాలే మారిపోతాయట."

"ఏం మాటాడ్తున్నావ్! నీ బుర్రసరిగ్గా పనిచేస్తోందా?" పడగ్గదిలోకి వెళ్తూ, విసుగ్గా అన్నాడు భూషణం. విజయ సమాధానం ఇవ్వలేదు. భర్త వెంట తానూ వెళ్తూ "ఇప్పుడు ఏదైనా సరిగ్గా పని చేస్తోందంటే నా బుర్ర మాత్రమే, మిగతావన్నీ నిదుర పోతున్నాయి" అంది మనస్సు, హృదయం, ఆత్మ, ఇట్లాటి వాటి నన్నింటిని నాల్గురోజులు ప్రక్కన ఉంచమని భర్త ఓ దారిని పడ్డాక తర్వాత చూడొచ్చు అంది విజయ తల్లి. "అబ్బాయి క్షేమం గురించి నువ్వు చెప్పేవి నిజమే కాని ఓ దశలో మగ మనిషికి ఇవేవీ అర్థం కావు. మితిమీరిన అహంలో ఉంటాడు. అయితే ఎంతోకాలం నిలవదు. కొంచెం ఓపిక ఉంటే చాలు!" అని కూడా అంది. అప్పుడు అక్కడే ఉన్న విజయ

తండ్రి కూడా "ఔనమ్మా" అని అనగానే తండ్రివైపు ఆశ్చర్యంగా చూచింది విజయ. భర్త పైన ప్రేమగానే వుంటుంది. కాని అతని తీరు, తెన్ను చూస్తుంటే, అతనిమీద గౌరవంగా అనిపించక అక్కడ్నించి వెళ్ళాన్నే? "ఆ తీరె అంత! అని అనుకుంటే పోదే విజయా! అబ్బాయైనా నిన్ను కొడతాడా, తిడతాడా, ఏవో రెండు సంస్కారం తక్కువ మాటలు మాట్లాడేదేమో! అందరూ సంస్కారవంతులే ఉంటారా? అదీగాక, ఏవో నాల్గురోజులు జల్సాగా తిరగొచ్చు. ఆ మీదట ఒంటి సత్తువ ఉండొద్దా?" అంది విజయ తల్లి. "సత్తువ కాదమ్మా! చేతిలో డబ్బుంటే ఆ ఆటలన్నీ ఎంత కాలమైనా సాగుతాయి" అంది విజయ.

"రేపు నీ కడుపులో రెండు కాయలు కాస్తే అన్నీ అవే తగ్గిపోతాయే. అంత చాకిరి చేసే మగ మనిషికి నిజంగా పిడికెడు అన్నం, జానెడు గుడ్డ అంతకు మించి ఆయనకేం దొరుకుతాయె పాపం!" అంది తల్లి. "ఆయన ఉద్యోగం నీకు తెలిసిందేగా పై సంపాదన బోలెడు వుంటుంది" అంది విజయ.

"సంపాదన పెరిగిన కొద్ది మగ మనిషికి అనుభవం తక్కువౌతుందే పిచ్చిదానా" అని మళ్ళీ "మగ మనిషి తత్వం చాలాసార్లు పసితనంగా వుంటుంది. జోకొట్టడం తెలిస్తే నిదరపోతారు. ఆడదానికి జోకొట్టడం రాకపోతే, ఎందుకు పనికివస్తారే" అని ఓకసురు కసిరింది ముసలమ్మ కూతురిని, అంతే.

"విజయా!" భర్త పిలుపుకి ఉలిక్కిపడి,

"ఏమిటండీ?" అంది విజయ.

"ఎటుంది నీ ధ్యాస?" భూషణం కొంచెం చిరాగ్గా అన్నాడు. విజయ నవ్వుతూ ఏదో అనబోయింది. అంతకన్నా ముందే భూషణం "ముందు నాకు ముద్దివ్వు" అన్నాడు.

"ఇజాజాత్ హై" అంది విజయ నవ్వుతూ.

"అబ్బ! నీ బోడి ఇజాజాత్ హై" అని భార్యను బలవంతంగా అన్నట్టు దగ్గరకు లాక్కొని బలంగా ముద్దు పెట్టుకున్నాడు భూషణం.

*

బాల హృదయాలను కూడా
రంజింపజేస్తున్న
ప్రజాతంత్ర
ప్రతివారం చదవండి